ఆర్థిక కష్టాలు గట్టెక్కాలి

- రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలి
- మంత్రి కొండా సురేఖ
- మేడారం సమ్మక్క-సారలమ్మకు పూజలు

మంత్రి సురేఖకు అమ్మవార్ల ప్రసాదాన్ని అందిస్తున్న పూజారులు

తాడ్వాయి, అక్టోబర్ 16 : సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతిబాటలో పయనించాలని, రాష్ట్ర ఆర్థిక కష్టాలు గట్టెక్కాలని శ్రీ సమ్మక్క-సారలమ్మకు ప్రత్యేక పూజలు చేసినట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయశాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ఆమె తన భర్త కొండా మురళీ, కుటుంబ సభ్యులతో కలి సి తల్లులను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించి మనవడి తల నీలాలను సమర్పించారు. సమ్మక్క-సారలమ్మల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, దేవాదాయశాఖ అధికారులు మంత్రికి ప్రత్యేక స్వాగతం పలికారు. అమ్మవార్ల గద్దెల వద్ద పూజలు చేసి అమ్మవార్లకు చీరె, పసుపు, కుంకుమ, బంగారాన్ని అందించారు. అనంతరం మంత్రి సురేఖ విలేకరులతో మాట్లాడుతూ సమ్మక్క-సారక్క జాతరను జాతీయ పండుగగా గుర్తించే వరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి జాతరను దిగ్విజయంగా చేపట్టిందని మంత్రి గుర్తు చేశారు. దేవాదాయశాఖ మంత్రిగా తాను, గిరిజన బిడ్డ మంత్రి సీతక్క, జాతర ప్రాంత అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు వనదేవతలు శక్తి సామార్థ్యాలను ప్రసాదించాలని మంత్రి ఆకాంక్షించారు.

ఆర్థిక ముఖచిత్రం పుస్తక ఆవిష్కరణ

ములుగురూరల్, అక్టోబర్ 16 : తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం 2024 పుస్తకాన్ని కలెక్టర్ టీఎస్ దివాకర తన కార్యాలయంలో ప్రణాళిక అధికారి ప్రకాశ్, డిప్యూటీ ఎస్‌వోలు లక్ష్మీనారాయణ, సాంబయ్య, డీపీఆర్వో రఫీక్‌తో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రణాళిక శాఖ రూపొందించిన పుస్తకంలో అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపర్చినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయాన్ని సంప్రదించి రూ.150 చెల్లించి పుస్తకాన్ని కొనుగోలు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు మద్దతు ఇవ్వాలి

ఏటూరునాగారం, అక్టోబర్ 16 : మండల కేంద్రంలోని వై జంక్షన్‌లో కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు ఈనెల 13న భూమి పూజ చేశారని, దీనికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని మాలమహానాడు మండల అధ్యక్షుడు మాదరి రాంబాబు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆత్మారి లక్ష్మణ్, కుమ్మరి చంద్రబాబు, గద్దం భిక్షపతి కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ విగ్రహ ఏర్పాటుపై ఐక్యంగా ఉన్న వారి మధ్య కొందరు ద్వేషం పెంచుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. ఈ ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కూడా స్థలం ఉన్నట్లు తెలిపారు. నాయకులు జాడి భోజారావు, కాళ్ల రామకృష్ణ, దేపాక శ్రీరాములు, వావిలాల ముత్తయ్య, వావిలాల రాంనర్సయ్య, ఎంపెల్లి రాజు, బోడ శంకర్, పెంచికల లక్ష్మీనారాయణ, వావిలాల కిశోర్, బోడ సారయ్య, మండపల్లి సాగర్, గోస్కుల రాంబాబు పాల్గొన్నారు.

రామప్ప విశిష్టతను తెలుసుకున్న వలంటీర్స్

వెంకటాపూర్, అక్టోబర్ 16 : రామప్పలో నిర్వహిస్తున్న వరల్డ్ హెరిటేజ్ వలంటీర్ ప్రోగ్రాం రెండో రోజు కొనసాగింది. వలంటీర్స్, యువ టూరిజం క్లబ్ సభ్యులకు బుధవారం ఉదయం రామప్పలో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగా క్లాసులు నిర్వహించారు. అనంతరం పాలంపేటలోని రైతువేదికలో ప్రొఫెసర్ పాండురంగారావు రామప్ప నిర్మాణశైలి, ఇంజినీరింగ్ టెక్నాలజీ, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, నీటిలో తేలే ఇటుకలపై వివరించారు. మధ్యాహ్నం రామప్ప దేవాలయా న్ని సందర్శించి రామప్ప విశిష్టత, చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యతపై పాండుగరంగారావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కుసుమ సూ ర్యకిరణ్, టూరిజం గైడ్స్ వివరించారు. ప్రొఫెసర్ దేవప్రతాప్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రావు, శ్రీనివాస్, టూరిజం, పురావస్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : భూపాలపల్లి ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా ప్రవేశ పెట్టిన ఆరు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రాంతీయ ఉప సంచాలకులు, భూపాలపల్లి, కాజీపేట ప్రిన్సిపాల్స్‌తో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాలు, కళాశాలలో సౌకర్యాల కల్పనపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఆపై విద్యార్హతలు ఉన్న విద్యార్థినీ విద్యార్థులు సుభాష్ కాలనీలోని ఐటీఐ కళాశాలలో నేరుగా కానీ, https://iti.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా కానీ అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 19 వరకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆరో విడుత వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. వివరాలకు ప్రభుత్వ ఐటీఐ భూపాలపల్లి, లేదా 8985100563 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమయం రెండు రోజులు మాత్రమే ఉన్నందున విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఐటీఐ కళాశాలలో పారిశుధ్య, అలాగే విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాంతీయ ఉప సంచాలకులు బీ సీతారాములు, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ జుమ్లానాయక్, కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్ పీ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయించొద్దు

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార పదార్థాలు విక్రయించొద్దని జిల్లా ఆహార భద్రత అధికారి రోహిత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని సితార ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు రెస్టారెంట్‌ను తనిఖీ చేశామన్నారు. శాంపిల్స్ తీసుకొని హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు చెప్పారు. వివరాలు రావడానికి సుమారుగా 10నుంచి 14రోజులు పడుతుందని, ఏదైనా తేడా వస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.

లక్నవరంను సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవోలు

గోవిందరావుపేట, అక్టోబర్ 16 : పర్యాటక ప్రాంతమైన లక్నవరంను బుధవారం హైదరాబాద్‌లోని దూలపల్లికి చెందిన 33మంది ట్రైనీ ఎఫ్‌బీవోలు సందర్శించారు. ఎఫ్‌బీవోల ట్రైనీ కోఆర్డినేటర్, దూలపల్లి ఎఫ్‌ఆర్వోఎం వంశీకృష్ణ ఆధ్వర్యంలో పస్రా ఎఫ్‌ఆర్వో మాధవి శీతల్ వారికి లక్నవరం గురించి వివరించారు. ఎనిమిది కిలోమీటర్ల ట్రెక్కింగ్, క్యాంపింగ్ సైట్, స్లూయిపాయింట్, ఈఎల్‌వో పార్క్‌లను తిరిగారు. తెల్ల పునికి, నీటి కానుగ వంటి కొత్త చెట్లతోపాటు వివిధ రకాల చెట్లను పరిశీలించారు. ఎఫ్‌ఎస్‌వో వేణుగోపాల్‌రెడ్డి, ఏబీవో టీ దీప్‌లాల్, పార్కు సిబ్బంది పాల్గొన్నారు.

ఆవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

ములుగురూరల్, అక్టోబర్ 16 : అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని బీజేపీ నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై పట్టుకున్నారు. జంగాలపల్లి నుంచి ములుగు వైపు గూడ్స్ వాహనంలో 14ఆవులను తరలిస్తుండగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ వాహనాన్ని ఆపి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు గోవులను, వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సురేందర్ మాట్లాడుతూ గోవులను రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రాకేశ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్, అజయ్‌రెడ్డి ఉన్నారు.

ఆర్చరీలో అనయకు సిల్వర్ మెడల్

సిల్వర్ మెడల్‌తో అనయ

కాటారం, అక్టోబర్ 16 : మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజశేఖర్ కుమార్తె అనయ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈనెల 15,16 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఎస్ఎఫ్ఏ స్పోర్ట్స్ ఫర్ ఆల్ చాంపియన్ షిప్‌లో భాగంగా అండర్-10 విభాగంలో అనయ సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు అనయను తోటి క్రీడాకారులు అభినందించారు.

లారీ ఢీకొని ఒకరి మృతి : ఇద్దరికి గాయాలు

వెంకటాపూర్, అక్టోబర్ 16 : మండలంలోని పెద్దాపూర్ - జంగుపల్లి గ్రామాల మధ్యలో బుధవారం సాయంత్రం లారీ ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్సై జక్కుల సతీశ్ కథనం ప్రకారం.. ద్విచక్ర వాహనంపై పేరాల వెంకట్, వేముల మణిప్రసాద్, జక్కిరాజు జశ్వంత్ పెద్దాపూర్ నుంచి భూపాలపల్లికి జంగుపల్లి మీదుగా వస్తున్నారు. ఈ క్రమంలో భూపాలపల్లి నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న లారీ ఢీ కొనగా పేరాల వెంకట్ (16) మృతిచెందాడు. మణిప్రసాద్, జశ్వంత్ తీవ్రంగా గాయపడగా 108లో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

కందకంలో పడి యువకుడి మృతి

కాటారం, అక్టోబర్ 16 : కాటారం పోలీస్‌స్టేషన్ పరిధి నస్తురుపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న కందకంలో పడి యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అభినవ్, ఏఎస్సై మొగిలి కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సవాయిసింగ్ బతుకుదెరువు కోసం కాళేశ్వరానికి వచ్చి స్వీట్ షాపు నడుపుతున్నాడు. ఈనెల 13న సవాయిసింగ్ తన ద్విచక్ర వాహనంపై కాటారానికి వచ్చి తిరిగి వెళ్లలేదు. బంధువులు వెతకగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. ఈ నెల 15న సవాయి సింగ్ సోదరుడు లక్ష్మణ్‌సింగ్ కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. కాగా, నస్తూరుపల్లి గ్రామ రోడ్డు పక్కన కందకంలో కుళ్లిన మృతదేహం ఉన్నట్లు సమాచారంతో వెళ్లి పరిశీలించగా బైక్ ఆధారంగా సవాయిసింగ్‌గా గుర్తించినట్లు చెప్పారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మల్హర్, అక్టోబర్ 16 : వరంగల్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, భూపాలపల్లి జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండలంలోని తాడిచెర్ల, కాపురం, మల్లారం గ్రామాల్లో గుడుంబా బట్టీలపై దాడులు చేసి నాలుగు కేసులు నమోదు చేసినట్లు కాటారం ఎక్సైజ్ ఎస్సై బీ కిష్టయ్య తెలిపారు. వారిని అరెస్టు చేసి 8లీటర్ల గుడుంబా, 20కిలోల చక్కెర స్వాధీనం చేసుకున్నారు. 600లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్ తిరుపతి, గౌడ కులస్తులు

కాశీంపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్

కృష్ణ కాలనీ, అక్టోబర్ 16 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి 12,13 వార్డులైన కాశీంపల్లి గౌడ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా జనగాం శ్రీనివాస్‌ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కులస్తులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయనను 13వ వార్డు కౌన్సిలర్ మంగళపల్లి తిరుపతి సన్మానించారు. గౌడ కులస్తులు పులి రవి, గండి చిరంజీవి, కెక్కర్ల సమ్మయ్య, గండి సంతోష్, కుమార్, పులి శ్రీనివాస్, గండి రాజయ్య, గుండగాని మహేందర్, తిరుపతి పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ములుగురూరల్, అక్టోబర్ 16 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ టీఎస్ దివాకర సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో అట్రాసిటీ కేసుల పెండింగ్, పురోగతిపై అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై చర్చించి కేసుల పరిష్కరానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మణ్‌నాయక్ గత సమావేశంలో చర్చించి తీసుకున్న చర్యలు, 36 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ పెండింగ్ ట్రయల్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వెంకటాపూర్, మంగపేట మండలాల్లోని లాండ్ కేసులను దర్యాప్తు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నూతన సభ్యులుగా జన్ను రవి, చింత కృష్ణ, బానోత్ రామునాయక్, మురుకుట్ల నరేందర్, సునర్కని రాంబాబును కలెక్టర్ నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ మూడు నెలలకు ఒక సారి సమావేశం నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో అందిస్తున్న మెనూ ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకొని సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, డీఏవో సురేశ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సింగరేణి ఖాళీ క్వార్టర్లకు 18న కౌన్సెలింగ్

భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి మారుతి

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఖాళీ క్వార్టర్లకు ఈ నెల 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు భూపాలపల్లి ఏరియా అధికార ప్రతినిధి కే మారుతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో మొత్తం 5,423 ఉద్యోగులకు గాను 4,751 క్వార్టర్లు ఉన్నాయన్నారు. భూపాలపల్లి జిల్లా అయినందున కొన్ని భవనాలను ప్రభుత్వ కార్యాలయాలకు, మరికొన్ని అధికారులకు పేమెంట్ పద్ధతిన కార్పొరేట్ ఆమోదంతో 133 క్వార్టర్లను సంస్థ నిబంధనలకు లోబడి కేటాయించినట్లు చెప్పారు. ఆరు నెలలుగా క్వార్టర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించకపోవడం వల్ల, ఉద్యోగ విరమణ పొందిన ఉ ద్యోగులు వారి క్వార్టర్లను కంపెనీకి అప్పజెప్పడంతో 169 క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి 18న పూర్తి పారదర్శకంగా బెటర్ మెంట్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉద్యోగుల సీనియారిటీ లిస్ట్‌ను ఇదివరకే ఏరియాలోని అన్ని గనుల నోటీస్ బోర్డుపై ఉంచామన్నారు. ఎటువంటి అభ్యంతరాలు రాలేదన్నారు.

ఖాళీ క్వార్టర్లు ఏవైనా లిస్ట్‌లో లేకపోతే ఈనెల 10 తెలియజేయాలని కోరామని, ఎవరి నుంచి సమాచారం రాలేదన్నారు. బెటర్‌మెంట్ కౌన్సెలింగ్ పూర్తయ్యాక ఏర్పడే ఖాళీలను క్వార్టర్ లేని వారికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏరియాలో సుమారు 1,099 క్వార్టర్ లేని కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ పేమెంట్ చేస్తున్నామని, వసతి సౌకర్యం కల్పించాలని యాజమాన్యం ఆకాంక్షిస్తుందని ఆయన తెలిపారు.

కాలువ తీయకుండా చెరువుకు నీళ్లు ఇవ్వండి

సర్వే పనులను అడ్డుకున్న ప్రతాపగిరి రైతులు

సర్వే పనులను అడ్డుకుంటున్న రైతులు

కాటారం, అక్టోబర్ 16 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథ కం ద్వారా చెరువుకు నీళ్లు ఇవ్వాల ని మండలంలోని ప్రతాపగిరి గ్రా మ రైతులు అధికారులకు విన్నవించారు. ఈ మేరకు గ్రామ శివారులో కాలువ పనులకు అధికారులు సర్వే చేస్తుండగా, విషయం తెలుసుకున్న రైతులు అక్కడకు చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుకు నీళ్లు ఇవ్వడం వల్ల తాము ఏటా రెండు పంటలు సాగు చేసుకుంటామన్నారు. అలా కాదని ఊరి మధ్యలో నుంచి కాలువ తీయడం వల్ల భూములు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. వెంటనే సర్వే పనులు నిలిపివేయాలని పట్టుబట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు పర్వవేన రాజబాబు, జక్కుల రమేశ్, కోడపాక మాధవ్, బం దెల కిష్టయ్య, పర్వతాలు, పోచయ్య, లింగ య్య, సమ్మయ్య, వీరగంటి రమేశ్, కూకట్ల రమేశ్, వేముల రాజయ్య పాల్గొన్నారు.

అర్ధరాత్రి వీరంగం

- ఇళ్లలోకి చొరబడి ఫర్నిచర్, సరుకులు ధ్వంసం
- నిందితుడు సవతి తల్లి కొడుకు
- ఆస్తి తగాదాలే కారణమా?

రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

గణపురం, అక్టోబర్ 16 : మండలంలోని బుద్ధారం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దారుణం చోటు చేసుకుంది. సుమారు 10 మంది రెండు ఇండ్లపై దాడి చేసి బైక్, ఫర్నిచర్‌తో పాటు నిత్యావసర వస్తువులను ధ్వంసం చేశారు. ఈ ఘటనపై బుధవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం సమ్మయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సారమ్మకు కుమారస్వామి, పరమేశ్ ఇద్దరు కుమారులు. కాగా, మొదటి భార్య చనిపోవడంతో సమ్మయ్య వెంకటలక్ష్మిని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు నాగరాజు ఉన్నాడు. వీరంతా ఒకే ఇంట్లో వేర్వేరుగా ఉంటున్నారు. కాగా, ఆస్తి పంపకాల్లో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సవతి తల్లి వెంకటలక్ష్మి గుడుంబా అమ్ముతున్నదని మంగళవారం ఉదయం గొడవ జరిగింది. దీంతో సవతితల్లి కొడుకు నాగరాజు మద్యం సేవించి తన అనుచరులతో మంగళవారం అర్ధరాత్రి తన అన్నలైన కుమారస్వామి, పరమేశ్ ఇండ్లలోకి వెళ్లి నిత్యావసర వస్తువులు, ఫర్నిచర్, బైక్, వంట సామగ్రి ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదును దోచుకెళ్లడంతోపాటు సెప్టిక్ ట్యాంకులో బియ్యం పారబోశారు. కాగా పిన తల్లి కుమారుడు నాగరాజు దాడికి పాల్పడు తాడనే ముందస్తు సమాచారంతో బాధిత కుటుంబ సభ్యులు ప్రాణభయంతో వేరే ఇంట్లో తలదాచుకున్నారు. వెంకటలక్ష్మి, ఆమె కుమారుడు నాగరాజుతో ప్రాణ భయం ఉందని, తమకు రక్షణ కల్పించాలని బుధవారం కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టామని దాడికి పాల్పడ్డ వారిలో 10మందిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

వరి పంటకు కంకినల్లి, ఆకుచుట్ట తెగులు

- బిర్రు పొట్టగా ఉండటంతో తాలుగా మారుతున్న వరి
- ఆందోళనలో అన్నదాతలు


కంకినల్లి తెగులుతో గింజ పట్టని వరి కంకి

గోవిందరావుపేట, అక్టోబర్ 16 : మండలంలోని ఆయా గ్రామాల్లోని వరిపంటకు ఆకుచుట్ట, కంకినల్లి తెగుళ్లు సోకడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట ప్రస్తుతం బిర్రు పొట్ట దశలో ఉంది. కంకినల్లి తెగులు రావడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నా రు. ఆకుచుట్ట పురుగు తెగులు కూడా మసలడంతో రైతులు ఎన్ని మందులు పిచికారీ చేసినా నివారణ కావడం లేదు. కంకినల్లి తెగులుతో ధాన్యం గింజలు తాలుగా మారి భారీస్థాయిలో దిగుబడి తగ్గనున్నది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదు. తెగుళ్ల నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు తగిన సలహాలు అందించి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

అధికారుల సూచనలు పాటించాలి..



ప్రస్తుతం వరి పంట ఈనే దశ నుంచి గింజ పాలు పోసుకునే దశలో ఉంది. ఈ పరిస్థితిలో ఎక్కువ వరిని కంకినల్లి ఆశించడంతో గింజ పాలు పోసుకోకుండా నల్లబడి తాలు అవుతున్నది. కంకినల్లి నివారణకు స్పైరమెసైఫెన్ 200ఎంఎల్, ప్రొపికోనోజాల్ 250ఎంఎల్ ఒక ఎకరానికి వాడి అధిక దిగుబడి పొందాలి. ఆకుచుట్ట పురుగు నివారణకు ఎకరానికి 500ఎంఎల్ క్లోర్‌ఫైరిఫాస్ మందు పిచికారీ చేయాలి.

- జితేందర్‌రెడ్డి, ఏవో

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మే ళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి అరూరి శ్యామల బుధవారం ఒ క ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ ప్రైవేట్ సంస్థలో పనిచేయడానికి 100 ఉద్యోగాల ఎంపిక ఉంటుందన్నారు. అభ్యర్థులు 18 ఏండ్లు పైబడి ఉండాలన్నారు. ఫార్మసిస్టు- 30, ట్రైనీ ఫార్మసిస్టు- 20 ఉద్యోగాలకు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అలాగే ఫార్మసిస్ట్ ట్రైనీ అసిస్టెంట్-20, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్ - 30 ఉద్యోగాలకు 10వ తరగతి నుంచి ఏదైనా డిగ్రీ పాసై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హతల సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, ఆధార్‌కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీ, 4పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 18న ఉదయం 11గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. 97010 78288, 95024 68800ను సంప్రదించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించిన అధికారులు

గోవిందరావుపేట, అక్టోబర్ 16 : మండలంలోని చల్వాయి రైతులతో ములుగు డీఈ నాగేశ్వర్‌రావు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ కెపాసిటర్ తప్పకుండా బిగించుకోవాలని సూచించారు. దీని వల్ల లోఓల్టేజ్ సమస్య రాకుండా ఉండటంతోపాటు మోటర్లు కాలిపోవని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయని సూచించారు. డీఈ వెంట పస్రా ఏఈ దేవ్‌సింగ్, లైన్‌మెన్ వేణు, రైతులు ఉన్నారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ములుగురూరల్, అక్టోబర్ 16 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ పాల్గొని మాట్లాడారు. విద్యా హక్కు చట్టాలు, బలవంతపు బాల్య వివాహాలపై, ఆడపిల్లల వివక్షతోపాటు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, హెచ్‌ఎం బీఆర్ ఉమాదేవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, మహిళా సంఘాలతో పాటు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని మహిళా సాధికారత కో ఆర్డినేటర్ అనూష అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి యాదవ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ, డీహెచ్ఈడబ్ల్యూ అకౌంటెంట్ సురేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలతో చర్చలు జరపాలి

కృష్ణకాలనీ, అక్టోబర్ 16 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి కళాశాలలు ప్రారంభమయ్యేలా చూడాలని పట్టభద్రుల నిరుద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీ నరేశ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడేళ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఆర్థికంగా చతికిలబడిన యాజమాన్యాలకు బకాయిలు విడుదల చేయాలని కోరారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణకాలనీ/ములుగు రూరల్, అక్టోబర్ 16 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సంఘంలోని సభ్యుల వయసు 18 నుంచి 29 ఏండ్ల లోపు ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నా లేకపోయినా ఆసక్తిగల యువజన సంఘాల నాయకులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, యువజన సంఘ ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో ఈనెల 19వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో చేపట్టబోయే యువజన సంక్షేమ కార్యక్రమాల్లో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని తెలిపారు. వివరాలకు 0870- 2958776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తగ్గుముఖం పట్టిన సీజనల్ వ్యాధులు

ములుగురూరల్, అక్టోబర్ 16 : జిల్లాలో సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయని, విషజ్వరాలతో మరణిస్తున్నట్లుగా వస్తున్న వార్తలపై ప్రజలు భయాందోళనకు గురి కావద్దని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నాలుగు నెలలుగా సంభవిస్తున్న మరణాలు గుండె జబ్బులు, కిడ్నీ సంబంధిత వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులతో వయోవృద్ధులు మరణించారని తెలిపారు. మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలతో మరణాలు సంభవించలేదన్నారు. సీహెచ్‌సీల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కృషి చేశామన్నారు. 123హై రిస్క్ గ్రామాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 35మలేరియా కేసులు, 45డెంగ్యూ కేసులను గుర్తించి ప్రభుత్వ దవాఖానలో చికిత్స అందించినట్లు అప్పయ్య తెలిపారు.

ఐటీఐ అడ్మిషన్లపై సమీక్ష

ఏటూరునాగారం, అక్టోబర్ 16 : పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఐటీఐలో అడ్మిషన్లు కల్పించేందుకు వారి నుంచి ఈనెల 18న స్వీకరించే దరఖాస్తుల ప్రక్రియపై బుధవారం ఉపాధి శిక్షణశాఖ వరంగల్ ప్రాంతీయ సంచాలకుడు సీతారాములు ఐటీఐ ప్రిన్సిపల్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను 6రకాలైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన కొత్త కోర్సులతో అడ్మిషన్లు ఇవ్వబోతున్నట్లు తెలిపారు. సమావేశం లో వాజేడు, ఏటూరునాగారం, ఖాజీపేట ఐటీఐల ప్రిన్సిపాల్స్ శేఖర్, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

చిట్యాల, అక్టోబర్ 16 : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు వైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి కుమారస్వామి అన్నారు. మండలంలోని ఏలేటి రామయ్యపల్లెలో ఆయన బుధవారం పశువులకు టీకాలు వేయించారు. మొత్తం 188 పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమూర్తి, ఏరియా పశు వైద్యశాల డాక్టర్ వెంకన్న, డాక్టర్ అజయ్, పశువైద్య సిబ్బంది లక్ష్మణ్, సుజాత, కరుణాకర్, పశుమిత్ర సునీత, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కాటారం, అక్టోబర్ 16 : మండలంలోని నస్తూరుపల్లి సమీపంలోని 353-సీ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బయ్యారం గ్రామానికి చెందిన పసుల గణేశ్ తన స్నేహితుడి బైక్ తీసుకొని మహదేవపూర్ మండలం మద్దులపల్లికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో నస్తురుపల్లి సమీపంలో రోడ్డుపై ఉన్న గాడీల వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు గాయాలై అక్కడే పడి ఉండగా వాహనదారులు గమనించి 108లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కృష్ణకాలనీ/ మల్హర్/ చిట్యాల, అక్టోబర్ 16 : డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన ఐదుగురికి భూపాలపల్లి జిల్లా జడ్జి బుధవారం జైలు శిక్ష విధించారు. సీఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో వాహన తనిఖీలు చేపడుతుండగా మద్యం తాగి వాహనం నడుపుతూ 11వ వార్డు భాస్కర్ గడ్డకు చెందిన బొల్లి లక్ష్మయ్య, 6వ వార్డు కృష్ణకాలనీకి చెందిన కుమ్మరి ఎల్లయ్య పట్టుబడినట్లు తెలిపారు. వీరిని జిల్లా కోర్టులో హాజరుపర్చగా రెండు రోజులు జైలు శిక్ష, రూ.వెయ్యి చొప్పున ఇద్దరికి జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. చిట్యాల మండలం చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన పడిదల దేవేందర్‌రావు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

CHANGE OF NAME
I, the undersigned ANKALLA VANITHA (New Name), previously called ANKALLA ANITHA (Old Name), and residing at H.No. 3-160, Venkatraopalli B, Tekumatla Mdl, Jayashankar Bhupalpally Dist, 506356, Telangana State, India, and solemnly declare.

CHANGE OF NAME
★ I, METTU CHANDRAMOULI (New Name) Previously Called METTA CHANDRA MOULI (Old Name) R/o H.No. 23-6-95/2/7, Durga Devi Colony, Near Kakatiya Gardens, Hunter Road, New Shayampet, Hanumakonda Dist.-506001. TG. India and Solemnly Declare.
NTW-000

CHANGE OF NAME
★I, NELLURI LAKSHIMI (New Name), previously called SIRIKONDA LAKSHIMI (Old Name), and R/o H.No. 1-7-847, Shanthi Nagar, Opp. Warangal Public School, Hunter Road, Hanamkonda (Mdl), Hanumakonda Dist., TG., India, and solemnly declare.
NTW-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565